టీబీఎల్‌సీకి నీటి విడుదల

రాయచూరు, జూన్ 14 : రాయచూరు, కొప్పల జిల్లాల్లో తాగునీటి అవసరాల కోసం ఈ నెల 15వ తేదీ నుంచి 10 రోజుల పాటు తుంగభద్ర ఎడమ కా లువకు 1500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తుంగభద్ర ఇంజినీరింగ్ అ ధికారులు శుక్రవారం రెండు జిల్లాల జిల్లాల అధికారులకు లేఖలు రాశారు. కా లువపై నిషేధాజ్ఞలు జారీ చేసి నీటి దుర్వినియోగం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు. కాలువ వెంబడి విద్యుత్ సరఫరా నిలిపివేసి అక్రమ వాడకంపై నిషేధం విధించాలని కోరారు. తాగునీరందించే చెరువులకు నీటిని విడుదల చేస్తున్నామని పేర్కొన్నారు.

రూ. 5వేల కోట్లతో కల్యాణ-కర్ణాటక అభివృద్ధి


కల్యాణ-కర్ణాటక ప్రాంత అధికారులు,ప్రజాప్రతినిధులతో సమావేశమైన సీఎం

● కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి : సీఎం

రాయచూరు, జూన్ 14 : కల్యాణ-కర్ణాటక ప్రాంత అభివృద్ధికి సంబంధించి రూ.5 వేల కోట్లు విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి సిద్దరామయ్య తెలిపారు. ఇందుకు సంబంధించి చేపట్టాల్సిన అభివృద్ధి పనుల కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసి 15 రోజుల్లోగా ప్రభుత్వానికి అందజేయాలని ఆదేశించారు. శుక్రవారం బెంగళూరులోని సీఎం నివాస గృహం కృష్ణ భవన్‌లో కల్యాణ-కర్ణాటక ప్రాంతానికి చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఇప్పటికే తమ ప్రభుత్వం కల్యాణ-కర్ణాటక ప్రాంత అభివృద్ధికి సంబంధించి రూ.14,228 కోట్లను విడుదల చేయగా ఇప్పటి వరకు రూ.10,342 కోట్లు ఖర్చు అయినట్లు తెలిపారు. మిగతా రూ.3,528 కోట్ల పనులకు సంబంధించి జూలై చివరిలోగా పనులను ప్రారంభించాలని ఆదేశించారు. ఏవైనా పనుల్లో ఇప్పటికీ టెండర్లు ఖరారు కాకపోతే వెంటనే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ ఏడాది కల్యాణ-కర్ణాటకతో పాటు రాష్ట్రంలో 41 మహిళా డిగ్రీ కళాశాలల ఏర్పాటుకు తాము హామీ ఇచ్చామని, త్వరలోనే వాటిని సిద్ధం చేస్తామన్నారు. కల్యాణ-కర్ణాటక ప్రాంతం కోసం విడుదల చేసిన నిధుల్లో 25 శాతం విద్యకు సంబంధించి అభివృద్ధి పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు.

రాష్ట్రానికి చేరిన కేంద్రమంత్రులు


మాట్లాడుతున్న కుమారస్వామి


తల్లిదండ్రుల ఆశీర్వాదం పొందుతూ..


కుమారస్వామికి ఘన స్వాగతం

● అభివృద్ధికి బాటలు వేస్తామని హామీ ● సొంత ప్రాంతాల్లో భారీ స్వాగతాలు ● వెల్లివిరిసిన అభిమానుల సంబరాలు

బెంగళూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కేంద్రకేబినెట్‌లో మంత్రులుగా నియమితులైన నలుగురు ముఖ్యులు రాష్ట్రానికి తొలిసారి వచ్చిన సందర్భంగా సందడి నెలకొంది. కేంద్రమంత్రులుగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి వారు సొంత ప్రాంతాలకు రావడంతో అభిమానులు, కార్యకర్తల్లో సంతోషం వెల్లివిరిసింది. శుక్రవారం మధ్యాహ్నం కుమారస్వామి బెంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నారు. కుమారుడు నిఖిల్‌తోపాటు జేడీఎస్ సీనియర్ నేత జీటీ దేవెగౌడ తదితరులు సాదరంగా స్వాగతించారు. సాదహళ్లిగేట్ నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలిరాగా ఓపెన్‌టాప్ వాహనంపై నగరానికి చేరుకున్నారు. దారి పొడవునా బీజేపీ, జేడీఎస్ అభిమానులు కార్యకర్తలు పూలమాలలు వేసి స్వాగతించారు. ఇదే సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత ప్రధాన మంత్రి నరేంద్రమోదీ కేబినెట్‌లో పనిచేసే అవకాశం కల్పించారని సంతోషం వ్యక్తం చేశారు. కేంద్రమంత్రిగా తన కర్మభూమికి వచ్చానని అన్నారు.రామనగర, మండ్య జిల్లాల ప్రజలకు రుణపడి ఉంటా అన్నారు. వ్యవసాయశాఖ మంత్రి కావాలని ఆశించానని, కీలకమైన భారీ పరిశ్రమలశాఖ దక్కిందని అన్నారు. జేడీఎస్‌ను ముగించేస్తా మన్న అహంకార పూరిత వ్యాఖ్యలకు స్పందించేది లేదన్నారు. తనకు రాజకీయాలకంటే రాష్ట్ర సమస్యల పరిష్కారం ముఖ్యం అన్నారు. ఇకపై వారంలో నాలుగురోజులు ఢిల్లీలో, రెండు రోజులు కర్ణాటకలో గడుపుతానని అందులో ఒకరోజు మండ్యకు కేటాయిస్తా అన్నారు. ఆ తర్వాత పార్టీ కార్యాలయం జేపీ భవన్‌కు వచ్చారు. అక్కడి నుంచి నేరుగా పద్మనాభనగర్‌లోని దేవెగౌడ నివాసానికి వెళ్లి తల్లిదండ్రుల ఆశీర్వాదం పొందారు.

సమన్వయంగా పనిచేస్తా : సోమణ్ణ

తనకు కేటాయించిన జలశక్తి, రైల్వేశాఖల్లో సమన్వయంగా పనిచేస్తానని కేంద్రమంత్రి సోమణ్ణ పేర్కొన్నారు. తుమకూరులోని సిద్దగంగామఠంలో శివకుమారస్వామిజీ సమాధికి పూజలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కేంద్ర కేబినెట్‌లో తనకు అవకాశం కల్పించిన ప్రధాని నరేంద్రమోదీకి రుణపడ్డానని అన్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, మాజీ ప్రధాని దేవెగౌడలకు ధన్యవాదాలు తెలిపారు. మదుగిరిలో కలుషితనీరు సేవించి ఆరుగురు మృతిచెందిన సంఘటనపై జిల్లా ఇన్‌చార్జ్‌మంత్రితో చర్చించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.


తుమకూరులో శివకుమారస్వామిజీ సమాధిని దర్శించుకుంటున్న కేంద్రమంత్రి సోమణ్ణ

రాష్ట్ర అభివృద్ధికి సంపూర్ణ సహకారం : ప్రహ్లాద్‌జోషి

రాష్ట్ర అభివృద్ధికి తన సంపూర్ణ సహకారం ఉంటుందని కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి వెల్లడించారు. హుబ్బళ్లిలో శుక్రవారం జోషిని అభిమానులు, కార్యకర్తలు సాదరంగా స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ఓటమిని జీర్ణించుకోలేకనే యడియూరప్పను కేసుల పేరిట వేధించాలని చూస్తోందన్నారు. ఆయనకు 80 ఏళ్లు దాటాయని, ఆయనపై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేయించి ఇబ్బంది కలిగించాలని యత్నించారని ఆరోపించారు. కేసులో వాస్తవం లేదని హోంశాఖ మంత్రి పరమేశ్వర్ గతంలోనే ప్రకటించారని గుర్తు చేశారు. కానీ నాన్‌బెయిలబుల్ వారెంట్ ఆదేశాలు జారీ చేయించారంటే కుట్ర ఉన్నట్టే అన్నారు. నటుడు దర్శన్ కేసులో సమగ్ర దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. ఇంధనశాఖ, ఆహార భద్రత వంటి కీలకమైనశాఖలు కేటాయించారని, ప్రధాని మోదీకి రుణపడ్డా అన్నారు. ఈ సందర్భంగా బైక్‌ర్యాలీతోపాటు ఊరేగింపు సాగింది. పార్టీ నేతలు మహేశ్‌టెంగినకాయి, మహేశ్ అమృత్‌దేశాయ్, ఎంఆర్‌పాటిల్, ప్రదీప్‌శెట్టర్ ఉన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న జోషి

కాంగ్రెస్ రెండంకెలకు చేరలేదు : శోభాకరంద్లాజె

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఎన్నికల్లో రెండంకెలకు చేరలేదని కేంద్ర మంత్రి శోభాకరంద్లాజె తెలిపారు. కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టాక తొలిసారి శోభాకరంద్లాజె శుక్రవారం బెంగళూరుకు వచ్చారు. ఎయిర్‌పోర్ట్‌లో సన్నిహితులు, పార్టీ నాయకులు ఆమెను స్వాగతించారు. పార్టీ కార్యాలయంలో వివిధ వర్గాల ప్రజలు ఆమెను సాదరంగా ఆహ్వానించారు. ఎంఎస్ఎంఈ, కార్మిక ఉపాధిశాఖలు దక్కడం సంతోషంగా ఉందన్నారు. బెంగళూరు ఉత్తర నియోజకవర్గ ప్రజలకు రుణపడ్డానని పేర్కొన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తా అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ రెండంకెలు దాటలేదన్నారు. రాజకీయ కుట్రతోనే యడియూరప్పపై కేసులు బనాయించి ఇబ్బంది కలిగించే ప్రయత్నం చేశారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఎవరికీ రక్షణ లేకుండా పోయిందని, నిరంతరంగా హత్యలు జరుగుతున్నాయని అన్నారు. ప్రభుత్వం హంతకుల పట్ల కఠినంగా వ్యవహరించడం లేదన్నారు.


బీజేపీ కార్యాలయంలో వివిధ సంఘాల ఆధ్వర్యంలో కేంద్రమంత్రి శోభాకరంద్లాజెకు సన్మానం

సీఎం కావాలంటే ఎమ్మెల్యేల మద్దతు ఉండాలి

● 60 మంది రాజీనామా అంటే పిల్ల చేష్టలా..?
● భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్


హుబ్బళ్లిలో మీడియాతో మంత్రి ఎంబీ పాటిల్

బెంగళూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి కావాలంటే ఎమ్మెల్యేల మద్దతు ఉండాలని, 60 మంది ఎమ్మెల్యేల రాజీనామా అంటే పిల్ల చేష్టలా..? అని భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో సీఎం ఎవరనేది అధిష్టానం నిర్ణయిస్తుందన్నారు. ప్రస్తుతానికి సీఎం స్థానంలో సిద్దరామయ్య ఉన్నారని, ఆ కుర్చీ ఖాళీగా లేదని, ఆ ప్రశ్నే రాదన్నారు. శుక్రవారం హుబ్బళ్లిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ముగ్గురు డీసీఎంలు కావాలనే అంశం పార్టీ అంతర్గత విషయమని, బహిరంగంగా చర్చించలేమని పేర్కొన్నారు. ఇప్పటికే పార్టీలో తమ అభిప్రాయాలు తెలిపామన్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం పతనమవుతుందనే బీజేపీ నేతల వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. తొలుత మహారాష్ట్రలో బీజేపీ ప్రభుత్వాన్ని కాపాడుకుంటే బాగుంటుందన్నారు. ఆ తర్వాత తమ ప్రభుత్వం గురించి మాట్లాడవచ్చు అన్నారు. తమ ప్రభుత్వం పతనం కావాలంటే 60 మంది రాజీనామా చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. బీజేపీకి చెందినవారే తమతో ఉన్నారని, ఇక జేడీఎస్ నుంచి కొందరు కాంగ్రెస్‌లోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. 60మంది రాజీనామా చేస్తే ఎన్నికలకు వెళ్లాల్సి ఉంటుందని, ఇదంతా పిల్లచేష్టలు కాదని అన్నారు. ఒక్క ఎమ్మెల్యే కూడా బీజేపీవైపు వెళ్లే ప్రశ్నే లేదని తేల్చి చెప్పారు. గ్యారెంటీలు రద్దు చేయాలనే ఆలోచన తమ వద్ద ప్రస్తుతానికి లేదన్నారు. కేంద్ర పరిశ్రమలశాఖ మంత్రిగా కుమారస్వామితో పాటు పలు కీలకశాఖలు రాష్ట్రానికి దక్కడం సంతోషకరమన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓటమిపై సమీక్షలు జరుగుతాయన్నారు. మంత్రులను తొలగిస్తారనేది మీడియా కథనాలు మాత్రమే అన్నారు. యడియూరప్పపై రాజకీయ ద్వేషం లేదని, పోక్సో కేసు విచారణ జరుపుతున్న పోలీసులు చర్యలు తీసుకుంటారన్నారు. నటుడు దర్శన్‌కు రాచమర్యాదల ప్రశ్నే లేదని, కేసులు రుజువైతే శిక్ష ఎదుర్కోవాల్సిందే అన్నారు. వ్యవసాయశాఖ రాయబారిగా నటుడు దర్శన్‌ను కొనసాగించే ప్రసక్తే లేదన్నారు.

బీజేపీ ఓటమికి అంతర్గత విభేదాలే కారణమా..?

● 8 చోట్ల ఓటమికి కారణాలపై పార్టీలో చర్చ ● ఏకపక్షంగా అభ్యర్థుల ఎంపికపై అంతర్మథనం ● జేడీఎస్‌తో పొత్తు కలిసి వచ్చిందని గుర్తించిన అధిష్టానం




బెంగళూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కొన్నేళ్లుగా బీజేపీకి కంచుకోటగా ఉండే కల్యాణ కర్ణాటకలోని ఐదు స్థానాలతో కలిపి మొత్తం 8 చోట్ల ఓటమికి అంతర్గత విభేదాలే కారణమా అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీలో ఇదే అంశంపై తీవ్రమైన చర్చ జరుగుతోంది. జేడీఎస్‌తో పొత్తు బీజేపీకి కలిసి వచ్చిందని పార్టీ అధిష్టానం గుర్తించింది. బీజేపీ పలు ప్రాంతాల్లో వెనుకబడేందుకు వర్గ విభేదాలే కారణమని తెలుస్తోంది. జేడీఎస్‌తో పొత్తు లేకుంటే మరిన్ని సీట్లు కోల్పోవాల్సి వచ్చేదని పార్టీలో అంతర్గత చర్చ సాగుతోంది. కేంద్ర మంత్రి భగవంత్ ఖూబా, బీజేపీ ఎమ్మెల్యేలతో సఖ్యత లేకపోవడం పెను అగాథానికి దారితీసింది. ఎమ్మెల్యేలు వ్యతిరేకిస్తున్నా బీదర్ టిక్కెట్‌ను మరోసారి ఖూబా దక్కించుకోవడం ఈ ఓటమికి కారణమైనట్లు పార్టీలో చర్చించుకుంటున్నారు. ఎమ్మెల్యే ప్రభు చౌహాన్ బహిరంగంగా వ్యతిరేకించారు. టిక్కెట్ల ఖరారుకు ముందే ఖూబాను పార్టీ పెద్ద వద్ద వ్యతిరేకించారు. టిక్కెట్ ఖరారైన తర్వాత ఇద్దరి మధ్య సయోధ్య కుదిర్చే ప్రయత్నాలు రాష్ట్ర నాయకులుగానీ, అటు జాతీయ నాయకులుగానీ కనీసంగాను చేయలేదు. భగవంత్ ఖూబా 2019లో 5,85,471 ఓట్లు పొందారు. ప్రస్తుత ఎన్నికల్లో 5,37,442 ఓట్లు దక్కించుకున్నారు. సుమారు 48వేల ఓట్లు కోల్పోయేందుకు కారణాలు గుర్తించాల్సి ఉంది. కేంద్రమంత్రిగా వ్యవహరించిన ఖూబా 26ఏళ్ల నవ యువకుడి చేతిలో చిత్తుగా ఓడిపోయారు. ఇక బళ్లారిలో మరోసారి శ్రీరాములుకు టిక్కెట్ ఇవ్వడం సరికాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్‌కు చెందిన తుకారాం 7,889 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. శాసనసభ ఎన్నికల్లో ఓడిన శ్రీరాములుకు ఆ వెంటనే లోక్‌సభ టిక్కెట్ ఇవ్వడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. చిక్కబళ్లాపురలో ఇటువంటి ప్రయోగమే చేసినా బళ్లారి విషయంలో పలువురి అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోలేదనే విమర్శలు ఉన్నాయి. బళ్లారిలో శ్రీరాములు బీజేపీ నుంచి, ఆయన చెల్లెలు శాంత హిందూపురంలో వైసీపీ నుంచి పోటీ చేయడం కూడా ఎన్నికల్లో చర్చకు కారణమైంది. ఇక ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సొంత నియోజకవర్గం కలబురగిలో అంతర్గత కలహాలు ఉమేశ్ జాధవ్ ఓటమికి కారణమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మల్లికార్జున ఖర్గేను ఓడించిన ఉమేశ్‌జాధవ్ ప్రస్తుతం ఖర్గే అల్లుడి చేతిలో ఓడిపోయారు. గుల్బర్గా గ్రామీణ మినహాయించి మిగిలిన అన్ని నియోజకవర్గాల్లోనూ బీజేపీ ఎమ్మెల్యేలు లేకపోవడం వెనుకబాటుకు కారణమైంది. జేడీఎస్‌కు చెందిన శరణుగౌడ కందుకూరు అంతర్గతంగా వ్యతిరేకించడం కూడా కారణమైనట్లు తెలుస్తోంది. చిక్కోడి నుంచి రెండోసారి పోటీ చేసిన అణ్ణా సాహెబ్ జొల్లె చిత్తుగా ఓడారు. భార్య శశికళ జొల్లెతో పాటు ఇద్దరు బీజేపీ ఎమ్మెల్యేలు ఉన్నా ఓటమి పాలయ్యారు. దావణగెరె లోక్‌సభ స్థానం నుంచి నాలుగుసార్లు విజయం సాధించిన జీఎం సిద్దేశ్వర్ భార్య గాయత్రికి టిక్కెట్ దక్కించుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ప్రభా మల్లికార్జున చేతిలో ఓడిపోయారు. బీజేపీ నుంచి ప్రత్యామ్నాయ అభ్యర్థి లేకపోవడమే ఇక్కడ ఆమెకు టిక్కెట్ ఇవ్వడం ఓటమికి కారణమైనట్లు తెలుస్తోంది. ఇక కొప్పళలో రెండుసార్లు గెలుపొంది సామాన్యుడిగా పేరొంది అందరిలో కలసిపోతారనే గుర్తింపు పొందిన కరడిసంగణ్ణను తప్పించి కొత్త వ్యక్తికి టిక్కెట్ ఇచ్చిన ప్రయోగం ఫలించలేదు. రాయచూరులో జేడీఎస్‌కు చెందిన కరెమ్మతోపాటు ఇద్దరు బీజేపీ ఎమ్మెల్యేలు ఉన్నా బీవీనాయక్‌ను మార్చి రాజా అమరేశ్వరనాయక్‌కు టిక్కెట్ ఇవ్వడం సరికాదనే అభిప్రాయపాలు ఉన్నాయి. చామరాజనగరలో శ్రీనివాసప్రసాద్ గత ఎన్నికల్లో సునాయాసంగా గెలుపొందారు. ఈసారి ఆయన ఎన్నికలకు దూరం కావడంతో ప్రత్యామ్నాయ అభ్యర్థిని ఎంపిక చేయడంలో విఫలమయ్యారు. బీజేపీ రాష్ట్రంలోనే చాలెంజ్‌గా ఉండే బెంగళూరు గ్రామీణ నుంచి డాక్టర్ సీఎన్ మంజునాథ్‌ను బరిలోకి దింపి విజయం సాధించడం రాష్ట్ర రాజకీయాల్లో తిరుగులేని రికార్డు అయ్యింది. ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ సోదరుడు, సిట్టింగ్ ఎంపీ డీకే సురేశ్‌పై మంజునాథ్ గెలుపొందారు. ఇక మైసూరు నుంచి యువరాజు యదువీర్, దక్షిణకన్నడలో కెప్టెన్ బ్రిజేశ్ చౌట విజయం ద్వారా అక్కడ బీజేపీ స్థానం సుస్థిరత కొనసాగినట్టయ్యింది.

గ్రాంట్లలో అన్యాయం జరిగితే ఎమ్మెల్యే పదవికి రాజీనామా..?

● బాంబు పేల్చిన కాంగ్రెస్ ఎమ్మెల్యే నాడగౌడ

బెంగళూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నియోజక వర్గాల అభివృద్ధికి కేటాయించే నిధుల విడుదలలో అన్యాయం జరిగితే ఎమ్మెల్యే పదవికి రాజీనామాకు వెనుకాడేది లేదని ముద్దేబిహాళ్ కాంగ్రెస్ ఎమ్మెల్యే, కర్ణాటక సోప్స్ అండ్ డిటెర్జెంట్స్ లిమి టెడ్ (కేఎస్‌డీఎల్) చైర్మన్ సీఎస్ నాడగౌడ పేర్కొన్నారు. ఇటీవలే నియో జకవర్గాలకు కరువు పరిహారం గ్రాంట్లలోనూ అన్యాయం జరిగిందని ఎమ్మెల్యే కోనరెడ్డి ఆరోపించిన తరుణంలోనే నాడగౌడ అదే రీతిలో అభిప్రాయపడ్డం అధికార పార్టీకి అవమానం చేసినట్టయ్యింది. ఒక నియోజకవర్గానికి గ్రాంట్లు విడుదల చేసి మరో ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేయ డం సరికాదని నాడగౌడ అసంతృప్తి వ్యక్తం చేశారు. వెనుకబడిన ప్రాంతమైన నా నియోజకవర్గానికి అన్యాయం జరిగితే నాకు రాజకీయ పదవి ఎందుకన్నారు. రాజకీయాలు చేయాలనే ఇష్టం లేదని ఎటువంటి త్యాగానికైనా వెనుకాడేది లేదని విజయపురలో మండిపడ్డారు. శుక్రవారం ముద్దేబిహాళ్ గెస్ట్‌హౌస్‌లో అధికారులతో సభ జరిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రం లో వెనుకబడిన నియోజకవర్గాలను అభివృద్ధి చేయా లన్నారు. ముద్దేబిహాళ్ ఒక్కటే కాదని ఇలా వెనుకబడిన పలు నియోజక వర్గాలకు అవసరమైన గ్రాంట్లు విడుదల చేయాలన్నారు. అభివృద్ధి చేయలేనప్పుడు నేను రాజకీయాల్లో కొనసాగడం వృథా అన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే నా నిర్ణయం తీసుకుంటా అన్నారు. ఒక్కో నియజకవర్గానికి అత్యధికంగా నిధులు కేటా యించి మరో నియోజకవర్గాన్ని నిర్లక్ష్యం చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. ప్రభుత్వం మాదేనని చెప్పు కోవడమేగానీ నిధులు రాకుంటే ఏం లాభమన్నారు. నాడగౌడ వ్యాఖ్యలతో ప్రభుత్వంలో సంచలనం కలిగించింది.





తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,582.69	1,581.06
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	3,737	106
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10	244
సామర్థ్యం (టీఎంసీలు)	5.91	5.01

జోరుగా సాగు



● అన్నదాతలో ఉత్సాహం నింపిన తొలకరి వానలు ● ఉభయ జిల్లాల్లో చురుగ్గా వ్యవసాయ పనులు

బళ్లారి సిటీ, జూన్ 14: ఉభయ జిల్లాల్లో గత ఏడాది తీవ్ర కరువుతో అల్లాడిపోయిన రైతాంగానికి ఈసారి కురుస్తున్న వర్షాలు ఊరట కలిగిస్తున్నాయి. వారం రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండడం, ఇప్పటి వరకు సాధారణం కంటే అధికంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు నాట్లు వేసేందుకు మొగ్గు చూపారు. దీంతో విజయనగరం జిల్లాలో 23శాతం నాట్లు పడినట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. రెండేళ్లుగా వర్షాలు కురవపోవడంతో జిల్లా రైతాంగం నానా అవస్థలు పడ్డారు. విజయనగరం జిల్లాలో సాగునీరు 59,185హెక్టార్లు, వర్షాధారం 23,5417 హెక్టార్లు కలిపి మొత్తం 2.94లక్షల హెక్టార్లలో నాట్లు వేశారు. ఇందులో 1,0023 హెక్టార్ల సాగునీరు, 59,267 హెక్టార్ల బహిరంగ భూమి మొత్తం 69,290 హెక్టార్ల విస్తీర్ణంలో ఇప్పటికే 23.52శాతం నాట్లు సాధించింది. జిల్లాలోని హరపనహళ్ళి తాలూకాలో 41.64 శాతం, హడగలిలో 23.12శాతం, హొస్పేట్ 17శాతం, కొట్టూరు, కూడ్లిగిలో 10శాతం నాట్లు పూర్తయ్యాయి. జిల్లాలో ప్రధాన పంట అయిన మొక్కజొన్న 1.95,754హెక్టార్లు లక్ష్యం ఉన్నప్పటికీ 57,728 హెక్టార్లలో నాట్లు వేశారు. గతంలో వరి , మొక్కజొన్న, కంది, పొద్దతిరుగుడు, వేరుశనగ తదితర పంటలు ఎండిపోయాయి. ఈసారి వాతావరణం అనుకూలంగా ఉండడంతో మరో వారం రోజుల్లో 100శాతం నాట్లు పడతాయని వ్యవసాయశాఖ అధికారులు లెక్కలు వేశారు. ఈసారి వర్షాలు బాగా కురువడంతో అన్నిచోట్ల వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్నాయి. రైతుల డిమాండ్ మేరకు విత్తనాలు, ఎరువులు, సరఫరా చేసేందుకు వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టడం స్వాగతించదగ్గ విషయం. అయితే ప్రైవేట్ కంపెనీలు సరఫరా చేస్తున్న విత్తనాలు, ఎరువుల నాణ్యతపై కూడా అధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



వరి నాట్లు వేస్తున్న దృశ్యం

ఎలుగుబంటి ప్రత్యక్షం

కంప్లి, జూన్ 14: తాలుకా పరిధిలోని జవుకు అంజనాపురం గ్రామం హైస్కూలు వద్ద శుక్రవారం సాయంత్రం ఎలుగుబంటి ప్రత్యక్షమైంది. జవుకు, అంజనాపురం, రెగ్యులేటర్ క్యాంపు ప్రజలు గమనించారు. ఎలుగుబంటి పాఠశాల లోకి వెళ్తుండగా గమనించిన ఉపాధ్యాయులు లక్ష్మీకాంత్, భోజరాజు పరుగులు తీశారు. అక్కడున్న ప్రజలు కేకలు వేయడంతో ఎలుగుబంటి పొలాల్లోకి పరుగెత్తింది. ఎలుగుబంటి రాకతో విద్యార్థులు, రైతులు ఆందోళనకు గురవుతున్నారు. దానిని బంధించాలని కోరుతున్నారు.



అంజనాపురం వద్ద కనిపించిన ఎలుగుబంటి

వర్షానికి కుప్పకూలిన ఇళ్లు

బళ్లారి సిటీ, జూన్ 14: వానాకాలం ప్రారంభంలోనే వర్షాలు అధికంగా కురుస్తుండటంతో పాత భవనాలు కూలిపోతున్నాయి. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మట్టి ఇళ్లల్లో నివశిస్తున్న వారు ఆందోళనకు గురవుతున్నారు. జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని మట్టి ఇళ్లు, పాత భవనాలు కూలిపోయే ప్రమాదం ఉంది. జూన్ 1వ తేది నుంచి కేవలం 12 రోజుల్లోనే మొత్తం 69ఇళ్ళు కూలిపోయాయి. బళ్లారిలో 10ఇళ్ళు, సిరుగుప్ప 2, సండూర్‌లో 5, కంప్లిలో 3ఇళ్ళు కూలిపోయాయి. రెవెన్యూశాఖతో పాటు అధికారుల బృందం గ్రామాల్లో పర్యటించి నష్టాన్ని అంచనా వేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకలంలో పాత ఇళ్ల యజమానులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



కూలిపోయిన మట్టి ఇల్లు

తోరణగల్లు: సండూరు తాలుకా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు పలు గ్రామాల్లో ఇల్లు దెబ్బ తిన్నాయి. సండూరు తాలుకా గొల్లలింగమ్మనహళ్లిలో దెబ్బతిన్న బాండ్ రేవప్ప ఇల్లు, సిలక్కలహళ్లిలో మరో ఇళ్లు దెబ్బతింది. సండూరులో 14 మిల్లీమీటర్లు, 12 మిల్లీమీటర్లు కురేకుప్పలో 2.3 మిల్లీమీటర్లు కురిసింది.



సిలక్కలహళ్లిలో దెబ్బతిన్న ఇల్లు



సిరుగుప్ప పట్టణంలో కురుస్తున్న వర్షం

సిరుగుప్ప : తాలుకా వ్యాప్తంగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. శుక్రవారం భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. పలు చోట్ల రోడ్లపై, మురుగు కాలువల్లో వర్షపు నీరు ప్రవహిస్తూ ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కాగా రైతులు మాత్రం వర్షాలతో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల్లో ఈఓ పర్యటన



పీడీ హళ్లి గ్రామంలో వీధులను పరిశీలిస్తున్న ఈవో బసప్ప

బళ్లారిరూరల్, జూన్ 14 : తాలుకాలోని పీడీ హళ్లితో సహా పలు గ్రామాలను శుక్రవారం ఈఓ పరిశీలించారు. పలు గ్రామాల్లో సమస్యలను గ్రామ పంచాయతీ పీడీఓ అధ్యక్షులు సమస్యలు వివరించారు. వర్షం ఎక్కువగా రావడంతో పీడీ హళ్లి గ్రామంలో పలు వీధుల్లో బురదమయం కావడంతో ఈఓ దృష్టికి గ్రామస్తులు తీసుకువెళ్లడంతో త్వరలో గ్రాంట్లు చేస్తానని గ్రామ పంచాయతీ అధ్యక్షులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీడీ హళ్లి గ్రామ పంచాయతీ అధ్యక్షులు లక్ష్మీనారాయణప్ప, గ్రామ పంచాయతీ సభ్యులు శివరాజ్, బ్రహ్మానందం, లింగప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పదవికి తుకారామ్ రాజీనామా

కంప్లి, జూన్ 14 : బళ్లారి ఎంపీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి బి శ్రీరాములు పై కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తుకారామ్ 98,992 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొంది ఎంపీగా ఎన్నికయ్యారు. సండూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉన్న ఆయన ఎంపీగా విజయంతో తన పదవికి రాజీనామా చేశారు. శుక్రవారం బెంగళూరులో విధానసభ కార్యదర్శి విశాలాక్షికి తన రాజీనామా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉభయ జిల్లాల్లో తమ పై నమ్మకం వుంచి ఎంపీ ఎన్నికల్లో భారీ మెజార్టీ అందించారన్నారు.



రాజీనామా పత్రం అందజేస్తున్న ఎంపీ తుకారామ్

చిరుత కోసం బోను సిద్ధం

కంప్లి, జూన్ 14 : తాలుకాలోని మెట్రి గ్రామ పంచాయతీ పరిధి చిన్నాపురం గ్రామం కృష్ణమూర్తి పొలంలో గురువారం చిరుత పులి కనిపించింది. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు శుక్రవారం బోను ఏర్పాటు చేశారు. అప్పటికే తాయమ్మ గుడి వద్ద అంజినప్ప గొర్రెల మందపై దాడి చేసి గొర్రెపిల్లను చంపి తినింది. చిరుతను బంధించాలని గొర్రెల కాపర్లు కోరుతున్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం: డీహెచ్ఓ



పచ్చజెండా ఊపి జాతాను ప్రారంభిస్తున్న డీ హెచ్ఓ రమేశ్‌బాబు

బళ్లారి సిటీ, జూన్ 14: రక్తం ఎంతో విలువైనదని, ఆపద సమయంలో ఎందరో ప్రాణాలు కాపాడుతుందని, ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్. రమేశ్‌బాబు పిలుపు నిచ్చారు. శుక్రవారం ప్రపంచ రక్తదాన దినోత్సవ వేడుకల్లో బాగంగా రాష్ట్ర ఎయిడ్స్ నివారణ, కర్ణాటక రాష్ట్ర బ్లడ్ డ్రైవ్ కౌన్సిల్, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, జిల్లా రక్త భద్రత కమిటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ నిర్వహణ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. 18ఏళ్ల నిండిన ఆరోగ్యవంతులందరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. అనంతరం శ్రీమతి సరళాదేవి కళాశాల హాల్లో ఏర్పాటు చేసిన వేదికను జిల్లా క్షయవ్యాధి నిర్మూలన అధికారిణి ఇంద్రాణి ప్రారంభించి మాట్లాడారు. సరళాదేవి కాలేజ్ ప్రిన్సిపాల్ మంజునాథ్‌రెడ్డి మాట్లాడుతూ రక్తదానానికి యువత మరింత ముందుకు రావాలన్నారు. ఈకార్యక్రమంలో అత్యధిక సార్లు రక్తదానం చేసిన వారిని సన్మానించారు. వారిలో సుభాస్ సింగ్(90)సార్లు, రాజేంద్రరెడ్డి(60), హొన్నూర్ సాబ్(58), దాదాపీర(52), సంపత్‌కుమార్(50), రాఘవేంద్ర(42)సార్లు, గోపన్న(38)సార్లు, రాము (35)సార్లు తదితరులను గౌరవించారు.

● ప్రపంచ రక్తదాన దినోత్సవంలో కళాశాల రెడ్‌క్రాస్ కోఆర్డినేటర్ డాక్టర్ పల్లవి, జిల్లా ఆశ్రయ వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ అబ్దుల్లా, జిల్లా ఆర్‌సీహెచ్ అధికారి డాక్టర్ హనుమంతప్ప, జిల్లా ఆరోగ్య విద్యాశాఖాధికారి ఈశ్వర్ హెచ్ దాసప్పనవర్,జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి కార్యాలయ సిబ్బంది గిరీశ్ తోపాటు కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. 103సార్లు రక్తదానం చేసిన ఎస్‌బీఐ రిటైర్డ్ ఉద్యోగి దేవన్నను సత్కరించారు.

సిరుగుప్ప: యువత రక్తదానానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని వైద్యులు ప్రకాష్ పాటిల్ పిలుపునిచ్చారు. సిరుగుప్ప పట్టణ ప్రభుత్వాస్పత్రిలో రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని స్పందన రక్తకేంద్రం ఆధ్వర్యంలో రక్తదాన శిబిర కార్యక్రమం జరిగింది. అనంతరం పలువురు యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా స్పందన రక్త కేంద్రం సిబ్బంది వెంకోబ, షాబాజ్, యువకులు పాల్గొన్నారు.

'నీట్'లో అవకతవకలపై విచారణ చేపట్టాలి



తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న విద్యార్థులు

సిరుగుప్ప, జూన్ 14 : 'నీట్' పరీక్షల్లో అవకతవకలు జరిగాయని, విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని ఆలిండియా డెమోక్రట్ విద్యార్థుల ఆర్గనైజేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం సిరుగుప్ప పట్టణంలో ఏఐడీఎస్‌వో ఆధ్వర్యంలో విద్యార్థులు హైస్కూలు మైదానం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. నీట్ పరీక్షల్లో భారీ అవకతవకలు జరిగాయని, పేద విద్యార్థులకు తీరని అన్యాయం జరిగిందని వాపోయారు. హర్యానా రాష్ట్రానికి చెందిన విద్యార్థులు 17 మంది విద్యార్థులు ఒకే గదిలో పరీక్షలు రాయగా అందరికీ ఒకే ర్యాంకు ఎలా దక్కిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం దీనిపై దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ సిద్ధార్థకు వినతిపత్రాన్ని అందజేశారు.

బీఎస్సీ కోర్సులు ప్రారంభించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘాల పదాధికారులు

కంప్లి, జూన్ 14 : స్థానిక డిగ్రీ కళాశాలలో బీఎస్సీ శిక్షణ కల్పించాలని రైతు సంఘం, కర్ణాటక దళిత సంఘర్ష సమితి (భీమవాడ) పదాధికారులు కోరారు. కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం తాలుకా అధ్యక్షులు చెన్నప్ప మాట్లాడుతూ ఎంతో మంది పేద ప్రజలు బీఏ, బీకామ్‌తో పాటు బీఎస్సీ కి కూడా డిగ్రీలో చదవటానికి ఆసక్తి కనబరుస్తున్నారు. కానీ అక్కడున్న అధ్యాపకులు, ఈ కళాశాలలో ల్యాబ్ అనుగుణంగా లేవంటూ విద్యార్థులకు తెలియజేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బీఎస్సీ పై ఆసక్తి గల విద్యార్థులను దృష్టిలో వుంచుకుని డిగ్రీ కళాశాలలో బీఎస్సీ శిక్షణకు అధ్యాపకులు, ల్యాబ్‌లను వెంటనే ఏర్పాటు చేసి శిక్షణ ఇప్పించాలని కోరారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చెన్నప్ప, ఉలిగేష్, రామప్ప, బసవరాజు, నాగరాజ, తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చండి..

కంప్లి, జూన్ 14 : ఎల్‌కేజీ, యుకేజీ విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని అధికారులు పిలుపునిస్తున్నారు. శుక్రవారం దేవలాపురం గ్రామంలో శిక్షణ శాఖ ఆధ్వర్యంలో అధికారులు దండోరా వేయించారు. ఇకపై చిన్నారులు అంగన్‌వాడీ పాఠశాలలకు చేర్చకుండా తమ వద్ద వున్న ప్రాథమిక పాఠశాలలో చేర్పాలని గ్రామంలో దండోరా వేయించారు. ఈ సందర్భంగా డీఈఓ సిద్ధలింగమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకే ఇప్పటికే పలు చోట్ల దండోరా వేయించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా మన్నారు.

వాహనదారుడితో ఆర్టీసీ డ్రైవర్ ఘర్షణ

రాయచూరు, జూన్ 14: జిల్లాలోని సింధనూరు నగరంలో స్థానిక గాంధిచౌక్ వద్ద శుక్రవారం దాదాపు గంట పాటు ట్రాఫిక్‌జామ్ జరిగింది. గంగావతి నుంచి లింగసుగూరుకు వెళుతున్న సింగల్‌మేన్ సర్వీస్ ఆర్టీసీ బస్సుకు ద్విచక్ర వాహనం ఒకటి అడ్డురాగా కోపగించిన డ్రైవర్ అతడితో ఘర్షణకు దిగాడు. బైక్‌దారుడిని దుర్భాషలాడడంతో ఆయన మరింత రెచ్చిపోయి బైక్‌ను బస్సుకు అడ్డంగా పెట్టడంతో దిగి వచ్చిన బస్సు డ్రైవర్ బైక్‌దారుడితో ఘర్షణకు దిగాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వివాదం జరిగి ఘర్షణ పెరిగిపోగా ఈ మార్గంలో దాదాపు గంటకు పైగా వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. వెంటనే అక్కడికి చేరుకున్న ట్రాఫిక్ పోలీసులు ఇద్దరిని సముదాయించి అక్కడి నుంచి పంపివేసి ట్రాఫిక్ క్లియర్ చేశారు. ట్రాఫిక్ పోలీసులు ఇద్దరి పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

లారీ బోల్తా

రాయచూరు, జూన్ 14 : జిల్లాలోని మస్కి తాలూకా సోమనాథ నాయక్ తండా సమీపంలో శుక్రవారం సబ్బుల లోడ్‌తో వెళుతున్న లారీ ఒకటి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు కాగా గుర్తించిన స్థానికులు ఆయనను ఆస్పత్రికి తరలించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన తుర్విహాళ్ పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా తాగిన మత్తులో ఉన్న డ్రైవర్ వాహనాన్ని వేగంగా నడపడం వల్లే ఈ ప్రమాదం సంబవించినట్లు పోలీసులు గుర్తించారు.

తెరుచుకోనున్న అన్న క్యాంటీన్లు

ధర్మవరం, జూన్ 14: పేదల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లు తెరుచుకోనున్నాయి. గత టీడీపీ హయాంలో ప్రతిష్టాత్మకంగా అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేశారు. కేవలం రూ.5కే టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందించారు. వివిధ పనుల నిమిత్తం పట్టణాలకు వచ్చే పేదలు, ఆటో కార్మికులు, వివిధ వ్యాపార సంస్థల్లో పనిచేసే వారిని అన్న క్యాంటీన్లు అమ్మలా అక్కున చేర్చుకుని, అన్నం పెట్టేవి. వాటికి పక్కా భవనాలను సైతం నిర్మించారు. 2019లో వైసీపీ అధికారం చేపట్టాక వైఎస్ జగన్ పేదల పొట్ట కొట్టారు. రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లను మూసివేయించారు. దీంతో పేదలు కడుపు మాడ్చుకోవాల్సి వచ్చింది. ప్రస్తుత ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అధికారంలోకి రావడంతో మళ్లీ పేదల్లో ఆశలు చిగురించాయి. ఎన్నికల ప్రచారంలో కూడా అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్లు తెరచి పేదల ఆకలి తీరుస్తానని చంద్రబాబు భరోసా ఇచ్చారు. ఆయన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో త్వరలోనే అన్న క్యాంటీన్లు తెరుచుకోనున్నాయి. జిల్లాలో మొట్టమొదటి సారిగా హిందూపురంలో ఎమ్మెల్యే బాలకృష్ణ తన పుట్టినరోజు సందర్భంగా ఈనెల 10వ తేదీన అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. 2018లో పేదల ఆకలి తీర్చాలన్న ఉద్దేశంతో అన్నక్యాంటీన్లకు అప్పటి సీఎం చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టారు. ధర్మవరంలో 2, హిందూపురం, పుట్టపర్తి, కదిరి, పెనుకొండ, మడకశిరలో ఒక్కొక్కటి చొప్పున నిర్మించారు. అన్న క్యాంటీన్‌లో రోజుకు దాదాపు 3వేల మందికి భోజనం, అల్పాహారం అందిస్తుండేవారు. పట్టుకేంద్రమైన ధర్మవరం పట్టణానికి రోజూ వివిధ పనుల నిమిత్తం వేర్వేరు ప్రాంతాల నుంచి ప్రజలు వస్తుంటారు. ఇక్కడ హోటళ్లలో టిఫిన్ చేయాలంటే రూ.40, భోజనం చేయాలంటే రూ.60 వెచ్చించాల్సి వస్తోంది. అన్నక్యాంటీన్లు పేదలకు ఎంతగానో ఉపయోగపడేవి. రోజూ ఉదయం, మధ్యాహ్నం, రాత్రి రూ.5కే టిఫిన్, భోజనం లభించేది. రోజుకు ఒక్కో క్యాంటీన్‌లో అల్పాహారం 350 మంది, మధ్యాహ్నం, రాత్రి భోజనం 900 మంది చేసేవారు. ప్రస్తుతం కూటమి అధికారంలోకి రావడంతో అన్న క్యాంటీన్లు తెరుచుకోనున్నాయి. దీంతో తక్కువ ధరకే టిఫిన్, భోజనం లభిస్తుందని పేదలు ఆశిస్తున్నారు.

హోసూరు జోన్

ఓంశక్తి ఆలయ వార్షికోత్సవం

హోసూరు, జూన్ 14: హోసూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఓంశక్తి అమ్మన్ ఆలయ రెండో వార్షికోత్సవం కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఉదయం మూలమంత్రం చదివి శూలం ప్రతిష్ఠాపన చేశారు. భక్తాదులు జయదుర్గ పాటలు పాడారు. హోమాలు, పూర్ణాహుతి అనంతరం అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. రాజశేఖరుడు గురువుల సమక్షంలో ఈ వేడుకను నిర్వహించారు. అనంతరం సాయంత్రం అమ్మవారి ఊరేగింపు ఉత్సవం సందడిగా సాగింది. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



హోమాలలో పాల్గొన్న భక్తులు

47 మందికి అస్వస్థత

హోసూరు, జూన్ 14: హోసూరు కార్పొరేషన్‌లోని నాల్గో వార్డు చిన్నయళసగిరి అంబేద్కర్ నగర్ వాసులు పలువురు వాంతులు విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. ఇలా గురు, శుక్రవారాల్లో బాధితులు సుమారు 47మంది దాకా చేరినట్టు తెలుస్తోంది. సమాచారం అందుకున్న కృష్ణగిరి జిల్లా కలెక్టర్ కె.ఎం.సరయు స్వయంగా ఆసుపత్రులకు వెళ్లి బాధితులను పరామర్శించారు. వారికి అందుతున్న వైద్యంపై ఆరా తీశారు. గురువారం 24 మంది, శుక్రవారం 23 మంది ఇలా మొత్తం 47మంది ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో చేరినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం అందరూ కోలుకుంటున్నారని వైద్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో నీటి పైపులను తనిఖీ చేసి అవసరమైన మేరకు మార్పులు చేపట్టారు. శుద్ధతాగునీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. అలాగే అంబేద్కర్ నగర్, అన్నానగర్‌లోని తన్నికై నగర్, అమ్మన్ నగర్ ప్రాంతాలలో వైద్యబృందాన్ని ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు. హోసూరు కార్పొరేషన్ కమిషనర్ స్నేహ, సబ్ కలెక్టర్ ప్రియాంక, జిల్లా ఆరోగ్య శాఖాధికారి రమేశ్ కుమార్, మున్సిపల్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకరన్, హోసూరు జిల్లా కలెక్టర్, విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.



వార్డుల్లో పరిశీలిస్తున్న కలెక్టర్ సరయూ

పారిశుధ్య చర్యలు

హోసూరు, జూన్ 14: హోసూరు చిన్నయళసగిరికి చెందిన 47 మందికిపైగా అనారోగ్యం కారణాలతో హోసూరు ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో చేరిన నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించారు. ఎంపీ గోపినాథ్, హోసూరు మేయర్ సత్య, సబ్ కలెక్టర్ ప్రియాంక, మున్సిపల్ కమిషనర్ స్నేహాలు ప్రజల ఆరోగ్యంపై ఆరా తీశారు. హోసూరు మున్సిపల్ కార్పొరేషన్‌లోని నాల్గో వార్డు చిన్న యళసగిరి, అంబేద్కర్ కాలనీ ప్రాంతంలో గురువారం రాత్రి వరకు మహిళలు సహా ముప్పై మందికిపైగా ఉన్నారు. ప్రస్తుతం తాగునీటి పైపులన్నీ కార్పొరేషన్ తరపున మారుస్తున్నారు. ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకులన్నీ శుభ్రం చేస్తున్నారు. అలాగే మండల ఆరోగ్యబృందం ప్రతి ఇంటికి వెళ్లి అవసరమైన మాత్రలు, మందులు అందజేస్తున్నారు. మున్సిపల్ లారీల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం సరఫరా అవుతున్న తాగునీటిని కాచి వడగట్టి తాగాలని సూచించారు. కాగా శుక్రవారం ఎవరూ ప్రభుత్వ ఆసుపత్రిలో ఎవరూ చేరలేదని వైద్యులు తెలిపారు.



నీటి పైపులను శుద్ధిచేస్తున్న సిబ్బంది

కోయంబత్తూరు సమావేశానికి తరలిన డీఎంకే నాయకులు

హోసూరూ, జూన్ 14: హోసూరు నగర డీఎంకే తరపున కోయంబత్తూరులో జరిగే మహాసభలో పాల్గొంటారని మున్సిపల్ డీఎంకే కార్యదర్శి మేయర్ సత్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15న శనివారం సాయంత్రం 4 గంటలకు కోయంబత్తూరులోని కొడిసియా మైదానంలో జరిగే డీఎంకే మూడవ మహాసభకు హోసూరు నగరం నుంచి డీఎంకే పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ పాల్గొంటారన్నారు. డీఎంకే అధ్యక్షుడిగా వ్యవహరించిన కరుణానిధి శత జయంతి వేడుకలు, తమిళనాడులో ఇండియా కూటమికి 40-40 విజయాన్ని అందించనందుకు తమిళనాడు ప్రజలకు ధన్యవాదాలు తెలిపే వేడుకగా సమావేశం కొనసాగుతుందన్నారు. హోసూరు నగరం తరపున పార్టీ నిర్వాహకులు, డివిజన్ కార్యదర్శి, ఏరియా అడ్మినిస్ట్రేటర్లు, సర్కిల్ నిర్వాహకులు, మున్సిపల్ జట్టు నిర్వాహకులు అసిస్టెంట్ ఆర్గనైజర్లు, ఏజెంట్లు అందరూ పాల్గొంటారన్నారు.

పౌరకార్మికుల సమస్యలను పరిష్కరిస్తాం

బళ్లారి సిటీ,జూన్ 14: సఫాయి కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని కర్మచారి జాతీయ కమిషన్ అధ్యక్షుడు ఎం.వెంకటేశ్ హామీ ఇచ్చారు. శుక్రవారం హొసపేట నగరంలోని పౌరకార్మికుల ఫిర్యాదులను ఆలకించి ఆరు నెలల్లో స్థలాన్ని గుర్తించి ఏడాదిన్నరలోగా అదే స్థలంలో ఇల్లు నిర్మించి ఇస్తామని పేర్కొన్నారు. జిల్లాకలెక్టర్ కార్యాలయంలో సమావేశానికి ముందు అంబేద్కర్ సర్కిల్ సమీపంలోని ఇందిరానగర్, శాంతినగర్ ప్రాంతాల్లో పర్యటించి ఆయా ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రభుత్వోద్యోగుల ఇళ్ల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. భారీ వర్షాల సమయంలో ఇళ్లలోకి నీరు చేరడంతో పాటు పలు సమస్యలపై పౌరసత్వ సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లాలోని అన్ని తాలూకాలకు చెందిన పౌరకార్మికులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల యజమానులతో సమావేశం నిర్వహించారు. మాదిగ సంఘం నాయకులు రామచంద్ర మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు జాతీయ విధానం రూపొందించాలని, పారిశుధ్య కార్మికుల సర్వే నిర్వహించాలన్నారు. పునరావాస ప్యాకేజీకి ఇచ్చే మొత్తాన్ని రూ.10లక్షల నుంచి రూ.30లక్షలకు పెంచాలన్నారు. గ్రామాల్లో కార్మికుల సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు. విజయనగరం అదనపు జిల్లాకలెక్టర్ అనురాధ, జిల్లా పంచాయతీ సీఈఓ సదాశివ ప్రభు, మహ్మద్ అలీ అక్రమ్‌షా, సలీం పాషా, మున్సిపల్ కమిషనర్ చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.



కార్మికుల సమస్యలను తెలుసుకుంటున్న జాతీయ అధ్యక్షుడు వెంకటేశ్

బక్రీద్‌ను శాంతియుతంగా జరుపుకోవాలి: ఎస్ఐ

బళ్లారిరూరల్, జూన్ 14 : బక్రీద్‌ను శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్ సూచించారు. తాలుకాలోని పీడీ హళ్లి పోలీస్ స్టేషన్ ఆవరణంలో శుక్రవారం సాయంత్రం ఎస్ఐ శశిధర్ నేతృత్వంలో 18 గ్రామాల ప్రజలతో శాంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో బక్రీద్‌ను శాంతియుతంగా జరుపుకోవాలని, మూగజీవాలను బలివ్వకుండా సంతోషంగా జరుపుకోవాలన్నారు. గ్రామాల్లో సమస్యలు ఏవైనా వుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సభకు పలు గ్రామాల ప్రముఖులు మాజీ తాలుకా పంచాయతీ సభ్యులు రూపనగుడి గోవిందప్ప, మాజీ గ్రామ పంచాయతీ ఉపాధ్యక్షులు రామాంజనేయులు, చేళగుర్కి హనుమంతు, వీరాపురం భాస్కర్‌రెడ్డి, ఎస్టీ ముష్టి వాల్మీకి అధ్యక్షులు బలరామ్, పీడీ హళ్లి జనార్దన్ నాయక్, గ్రామ పంచాయతీ ఉపాధ్యక్షులు శివరాజ్, అధ్యక్షులు లక్ష్మీనారాయణప్ప, పలు గ్రామాల ప్రముఖులు, ముస్లిం సోదరులు ఖలీల్ సాబ్, ఖాదర్, మహమ్మద్ రఫీక్, ఖాజా, వన్నూరుసాబ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ శశిధర్

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

శ్రీశ్రీ (వర్ధంతి)



శ్రీశ్రీగా పేరొందిన శ్రీరంగం శ్రీనివాసరావు 1910 ఏప్రిల్ 30న విశాఖపట్నంలో జన్మించారు. 20వ శతాబ్దపు తెలుగు సాహిత్యాన్ని శాసించిన మహాకవి. విప్లవ కవిగా, సంప్రదాయ, ఛందోబద్ధ కవిత్వాన్ని ధిక్కరించిన వాదిగా, అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడిగా, విప్లవ రచయితల సంఘం సంస్థాపక అధ్యక్షుడిగా, సినీ గేయ రచయితగా రాణించారు. 'మహాప్రస్థానం' కావ్యం ఎంతో పేరొందింది. అల్లూరి సీతారామరాజు సినిమాకు 'తెలుగువీర లేవరా..' పాట ఆయన ఆణిముత్యాలలో ఒకటి. కేంద్రసాహిత్య అకాడమీ, రాజా లక్ష్మీ ఫౌండేషన్ తదితర పురస్కారాలు పొందారు. 1983 జూన్ 15న కన్నుమూశారు.

ఇల్లిందల సరస్వతీదేవి (జయంతి)



కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్న తొలి తెలుగు రచయిత్రిగా గుర్తింపు పొందిన ఇల్లిందల సరస్వతీదేవి 1918 జూన్ 15న పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురంలో జన్మించారు. స్వయంకృషితో ఆంగ్ల, హిందీ భాషలు నేర్చుకున్నారు. జర్నలిజంలో డిప్లమో చేశారు. 250 కథలు, 5 నవలలు, 5 వ్యాస సంపుటాలు, జీవితచరిత్రలు రచించారు. ఇతర భాషల పుస్తకాలను కూడా అనువాదం చేశారు. బాల సాహిత్య కారిణిగా నాటికలు, రేడియో నాటికలు రచనలు చేశారు. 1958లో ఏర్పాటైన ఆంధ్రప్రదేశ్ శాసన మండలికి ఎమ్మెల్సీగా నామినేట్ అయ్యారు. 1998 ఆగస్టు 31న కన్నుమూశారు.

దేవిప్రసాద్ రాయ్ చౌదరి (జయంతి)




పద్మభూషణ్ గ్రహీత డీపీ రాయ్ చౌదరిగా పేరొందిన దేవిప్రసాద్ రాయ్ చౌదరి 1899 జూన్ 15న జన్మించారు. ప్రత్యేకించి ఇత్తడి విగ్రహాలు రూపొందించడంలో ప్రసిద్ధులు. అంతేకాక చిత్రకారుడిగా, విద్యా వేత్తగా రాణించారు. సామాజిక అంశాలపై ఆయన చిత్రాలు గీసేవారు. తైలవర్ణచిత్రాలు, పోర్ట్రెయిట్స్ కూడా గీసేవారు. మద్రాస్ స్కూల్ ఆఫ్ ఆర్ట్‌కు ప్రిన్సిపాల్‌గా 1929 నుంచి 1957 వరకు వ్యవహరించారు. ఫెలో ఆఫ్ లలిత్ కళా అకాడమీగా ఎంపికయ్యారు. 1975 అక్టోబరు 15న కన్నుమూశారు.

సురయ్యా (జయంతి)



సురయ్యా జమాల్ షేక్ 1929 జూన్ 15న లాహోర్‌లో జన్మించారు. ప్రముఖ హిందీ నటి, గాయని. 1941లో తాజ్ మహల్ చిత్రంలో బాలనటిగా మేనమామ జుహూర్ పరి చయం చేశారు. 'మీర్జాగాలిబ్' సినిమా ఆమెకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెట్టింది. 67 సినిమాలలో నటించగా 300కుపైగా పాటలు పాడి గాయనిగా 'క్వీన్ ఆఫ్ మెలోడి'గా గుర్తింపు పొందారు. 2004 జనవరి 31న కన్నుమూశారు.

జియా ఫరీదుద్దీన్ దాగర్ (జయంతి)




ఉస్తాద్ జియా ఫరీదుద్దీన్ దాగర్ 1932 జూన్ 15న రాజస్థాన్ రాష్ట్రం ఉదయ్ పూర్‌లో జన్మించారు. ధృపద్ శైలిలోని హిందూస్తానీ శైలి సంగీతంలో రాణించారు. సంగీత నాటక అకాడమీ అవార్డు, తాన్‌సేన్ సమ్మాన్ అవార్డు ఇతర గౌరవాలు అందుకున్నారు. ఐఐటీ బాంబేలో ప్రత్యేక అతిథిగా వ్యవహరించారు. 2013 మే 8న కన్నుమూశారు.

చక్రి (జయంతి)




జిల్లా చక్రధర్ అలియాస్ చక్రి 1974 జూన్ 15న వరంగల్ జిల్లా మహబూబాబాద్ మండలం కంబాలపల్లిలో జన్మించారు. ప్రముఖ సంగీత దర్శకుడు, గాయకుడు. టాలీవుడ్‌లో 85 సినిమాలకు సంగీతాన్ని అందించారు. పూరి జగన్నాథ్ దర్శకత్వం వహించిన 'బాచి' సినిమాతో కెరీర్‌ను ఆరంభించారు. కంపోజర్‌గా కొత్త గాయకులకు, రచయితలకు అవకాశం కల్పించారు. ప్రత్యేకించి 'రవితేజ' సినిమాలకు మ్యూజికల్ హిట్స్ అందించారు. ఫిల్మ్‌ఫేర్ అవార్డు అందుకున్నారు. 2014 డిసెంబరు 15న కన్నుమూశారు.

అన్నా హజారే (పుట్టినరోజు)



'పద్మభూషణ్' గ్రహీత అన్నా హజారే 1937 జూన్ 15న జన్మించారు. అసలు పేరు కిసాన్ బాబురావ్ హజారే. సంఘ సంస్కర్త. గ్రామాల అభి వృద్ధికి, పాలనలో పారదర్శకత కోసం పాటుపడ్డారు. అవినీతి రహిత సమాజ లక్ష్యంగా చైతన్యం కల్పించారు. నిరాహార దీక్షలు, నిరసనలు చేశారు. మహారాష్ట్రలోని అహ్మదానగర్ జిల్లాలోని రాలెగన్‌సిద్ధి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చి 1992లో 'పద్మభూషణ్' అం దుకున్నారు. అంతర్జాతీయ, జాతీయస్థాయిలో గౌరవా లు అందుకున్నారు.

లక్ష్మీమిట్టల్ (పుట్టినరోజు)



లక్ష్మీమిట్టల్ 1950 జూన్ 15న రాజస్థాన్ రాష్ట్రం సదుల్‌పూర్‌లో జన్మించారు. ప్రపంచంలో అతి పెద్ద స్టీల్ తయారీ సంస్థ ఆర్సెలర్ మిట్టల్‌కు ఎగ్జిక్యూటివ్ చైర్మన్. 2008 నుంచి పలు సంస్థల బోర్డ్ ఆఫ్ డైరెక్టర్‌లలో ఒకరిగా కొనసాగుతున్నారు. గ్లోబల్ సీఈఓ కౌన్సిల్ ఆఫ్ ది చైనీస్ పీపుల్స్ అసోసియేషన్ ఫర్ ఫ్రెండ్‌షిప్ విత్ ఫారిన్ కంట్రీస్‌కు సభ్యుడిగా, వ రల్డ్ ఎకనామిక్ ఫోరమ్స్ ఇంటర్నేషనల్ బిజినెస్ కౌన్సిల్, యూరోపియన్ రౌండ్ టేబుల్ ఆఫ్ ఇండస్ట్రియలిస్ట్ తదితర బోర్డులలో ఉన్నారు. 2024లో గ్లోబల్‌స్థాయిలో 113వ స్థాయిలోనూ దేశంలో శ్రీమంతులలో 13వ స్థానంలో నిలిచారు.

రాజీనామా ఇవ్వను .. మేమంతా ఒక్కటే

» మాకోసం మీరెందుకు బట్టలు చించుకుంటారు?

» చిక్కబళ్లాపుర ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్



ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్

బెంగళూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పదవికి రాజీనామా ఇవ్వనని మేమంతా ఒక్కటేనని మాకోసం మారెందుకు బట్టలు చించుకుంటారంటూ చిక్కబళ్లాపుర కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ తేల్చి చెప్పారు. శుక్రవారం చిక్కబళ్లాపురలో మీడియాతో మాట్లాడుతూ నేను రాజీనామా చేయాలని కోరుకునేవారందరికీ ధన్యవాదాలన్నారు. సుధాకర్ నా సవాళ్లను స్వీకరించలేదని, అప్పుడు నేనెందుకు రాజీనామా చేయాలన్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమన్నారు. బీజేపీవారు నేను రాజీనామా చేస్తానని వేచి చూస్తున్నా అన్నారు. అదే జరిగితే ప్రశాంతంగా ఉండవచ్చునని భావిస్తున్నారన్నారు. నేను అటువంటి అవకాశం ఇచ్చేది లేదన్నారు. ఎంపీగా డాక్టర్ సుధాకర్‌కు ప్రజలు ఆశీర్వదించారన్నారు. ఎంపీ సుధాకర్‌కు నేను అభినందిస్తున్నా అన్నారు. మంచి పనులు చేయాలన్నారు. మేమంతా ఒక్కటేనన్నారు. మాకోసం మీరెవ్వరూ బట్టలు చించుకోరాదన్నారు. సుధాకర్ ఢిల్లీలో నేను బెంగళూరులో ఉంటానన్నారు. ఎన్నికలకు ముందు ప్రదీప్ ఈశ్వర్ సంచలనమైన సవాళ్లు విసిరారు. సుధాకర్‌ను పార్లమెంటుకు పంపేది లేదని, చిక్కబళ్లాపురలో ఒక్క ఓటు ఎక్కువ వచ్చినా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు.

12 కిలోమీటర్లు సాష్టాంగ నమస్కారాలు

» మోదీ మూడోసారి ప్రధాని కావడంపై మొక్కు తీర్చుకున్న అభిమాని



సాష్టాంగ నమస్కారాలు చేస్తున్న అభిమాని మల్లేశప్ప

బెంగళూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు ద్వారా ప్రధానిగా నరేంద్రమోదీ మూడోసారి ప్రమాణస్వీకారం చేస్తే 12 కిలోమీటర్లు సాష్టాంగ నమస్కారాలు చేస్తానన్న అభిమాని మొక్కు తీర్చుకున్నారు. శుక్రవారం హాసన్ జిల్లా అరసికెరె తాలూకా హిరెమగళగెరె గ్రామానికి చెందిన జి.డి.మల్లేశప్ప (60) పాటించారు. హిరెమగళగెరె గ్రామంలోని హచ్చంగమ్మదేవి ఆలయం నుంచి బేవనహళ్ళి తాండా యు బేవనహళ్ళి గ్రామం మీదుగా హచ్చంగిదుర్గ గ్రామంలోని హచ్చంగమ్మ ఆలయానికి చేరుకున్నారు. ఉదయం 8 గంటలకు గ్రామస్థులతో కలసి ఆలయం వద్ద పూజలు చేశారు. మహిళలు హారతులు ఇచ్చి మోదీ మోదీ అంటూ నినాదాలు చేశారు. దేవుడికి మొక్కుకున్నట్టు ప్రధాన మంత్రిగా నరేంద్రమోదీ మూడోసారి పీఎం కావడంతో సాష్టాంగ నమస్కారాల మొక్కు తీర్చుకున్నా అన్నారు. పెద్దసంఖ్యలో అభిమానులు వెంట ఉన్నారు.

ప్రతిభావంత విద్యార్థులను ప్రోత్సహించాలి



విద్యార్థినికి ఆత్మీయ సత్కారం

బాగేపల్లి, జూన్ 14: వెనుకబడిన తాలూకాలో విద్యార్థులు అద్వితీయ ప్రతిభను చాటడం ద్వారా విద్యారంగంలో సరిహద్దులో సత్తా చాటారని ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి ప్రశంసించారు. పట్టణంలోని సీనియర్ పాత్రికేయుడు గురుమూర్తి కుమార్తె పి.జి.విద్యా నీట్ పరీక్షా ఫలితాల్లో 658మార్కులు సాధించిన నేపథ్యంలో సదరు విద్యార్థిని ఇంటికి వెళ్లి అభినందించి ప్రోత్సాహక మొత్తాన్ని అందచేశారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా బాగేపల్లి తాలూకా విద్యార్థులు విద్యారంగంలో సాధన కనబరుస్తున్నారని, పలువురు రాష్ట్రస్థాయిలో సత్తా చాటి తాలూకా కీర్తిని ఇనుమపడింపచేశారన్నారు. గురుమూర్తి కుమార్తె జాతీయస్థాయిలో నీట్ పరీక్షల్లో 658 మార్కులు సాధించడం గర్వకారణమన్నారు. అదే విధంగా అత్యంత పేద కుటుంబంలో జన్మించి తండ్రి కోల్పోయినా కూడా పేపర్ పంపిణీ ద్వారా డిగ్రీ, పీజీ కోర్సుల్లో ర్యాంకులు సాధించిన ఆర్ గణేశ్ మాదిరిగా నిలిచారన్నారు. సాధన వెనుక శ్రమ ఒక్కటే కారణమన్నారు. విద్యా సాధనకు పేదరికానికి సంబంధం లేదని ఇటువంటివారిని చూస్తే తెలుస్తుందన్నారు. ఈసారి ఎస్ఎస్ఎస్‌సీ ఫలితాల్లో రాష్ట్రంలో మూడో ర్యాంకులో బాగేపల్లి తాలూకా నిలిచిందన్నారు. సాధక విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఆకాంక్షిస్తున్నట్టు పేర్కొన్నారు. ఇదే సందర్భంగా పాత్రికేయుల పిల్లలు, పత్రికారంగానికి చెందిన పిల్లలు విద్యలో రాణిస్తే వారిని గుర్తించి ప్రోత్సహించే బాధ్యత పాత్రికేయ సంఘాలు చేపట్టాలని అభిప్రాయపడ్డారు. సమాజంలో ఇతరుల సాధనను ప్రోత్సహించిన రీతిలోనే వీరికి కూడా తగిన ప్రోత్సాహం ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ ఆర్ వర్ణి, జిల్లా పంచాయతీ మాజీ సభ్యుడు నరసింహప్ప, తాలూకా పంచాయతీ మాజీ అధ్యక్షుడు కేఆర్ నరేంద్ర, తాలూకా కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు డి.ఎన్.కృష్ణారెడ్డి, కన్నడ కళాసంఘం అధ్యక్షుడు రాజేశ్, పాత్రికేయుల సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, విద్యార్థిని తల్లిదండ్రులు సావిత్రమ్మ, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌రంగంలో గణనీయ ప్రగతి



పురస్కారాల ప్రదానంలో మంత్రి దినేశ్ గుండూరావు

బెంగళూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ రంగం విద్య, ఆరోగ్య రంగంలో సహకారంతోపాటు ఉత్తమ సేవలకు వేదికగా పనిచేస్తోందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దినేశ్ గుండూరావు అభిప్రాయపడ్డారు. చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా (అసోచామ్) నగరంలో హెచ్‌ఆర్ కాన్‌క్లేవ్ జరిపింది. హెచ్‌ఆర్ ట్రయల్‌బ్లేజర్ పురస్కారాలను ప్రదానం చేసింది. మానవ వనరుల రంగంలో అత్యుత్తమ సాధనలు, ఆధునిక విధానాలను ఆచరిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. అసోచామ్ సీహెచ్‌ఆర్ఎంపీ సాయంతో భారత్‌ను స్వావలంబన దిశగా అనే అంశంపై ప్రత్యేక నివేదిక విడుదల చేశారు. మంత్రి దినేశ్ గుండూరావు మాట్లాడుతూ దేశంలో 140 కోట్లమంది జనాభా ఉన్నారని, ఇటీవల 40ఏళ్లలో కార్పొరేట్ రంగం ఊహించని విధంగా ప్రగతి సాధించిందన్నారు. రానున్నరోజుల్లో సూపర్ పవర్ అనేస్థాయికి ఎదగాలన్నారు. వివిధ హెచ్‌ఆర్ కంపెనీలకు పురస్కారాలు ప్రదానం చేశారు. అసోచామ్ కర్ణాటక చైర్మన్ పరశురామ్, కో చైర్మన్‌లు అంజుమజిద్, ప్రకాశ్‌లతోపాటు సౌత్ రీజియన్ చైర్మన్ అగస్టస్ అజ్రాయ్‌లు పాల్గొన్నారు.

ఇద్దరు బాలకార్మికుల రక్షణ



బాలకార్మిక చట్టాలపై పోస్టర్ల ఆవిష్కరణ

దొడ్డబళ్ళాపుర, జూన్ 14: తాలూకాలోని వివిధ దుకాణాలు, గ్యారేజ్‌లలో కార్మికశాఖ, పోలీసు, స్త్రీ శిశుసంక్షేమశాఖ అభివృద్ధి తదితరశాఖల ఆధ్వర్యంలో శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఇద్దరు బాలకార్మికులను రక్షించారు. దుకాణాలు, గ్యారేజ్‌లు, బేకరీలు, చికెన్, మటన్ దుకాణాలు, ఇతర వాణిజ్య సంస్థలను పరిశీలించారు. ఈ సందర్భంగా బాలకార్మికుల నియంత్రణకు సంబంధించి పలు పోస్టర్‌లు ఆవిష్కరించారు. పరిశీలనవేళ ఇద్దరు బాలకార్మికులను గుర్తించి వారిని రక్షించారు. బాలలచేత పనులు చేయించడం నేరమని నిర్వాహకులను హెచ్చరించారు. కనీసం రెండేళ్ల జైలుశిక్ష, రూ.50వేల వరకు జరిమానా అవకాశం ఉందన్నారు. ఎక్కడైనా బాలకార్మికులు ఉన్నట్టు గుర్తిస్తే 1098 హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని అధికారులు తెలిపారు. రక్షించినవారిని పిల్లల సంక్షేమ సమితి ముందు హాజరు పరిచారు. దాడులలో కార్మికశాఖ అధికారి నాగేంద్ర, దయానందసాగర్, జిల్లాకార్మిక యోజనా డైరెక్టర్ సుబ్బారావ్, ఎస్సై కృష్ణప్ప, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ నీరు జలజీవన్ లక్ష్యం



భూమిపూజలో గ్రామపంచాయతీ అధ్యక్షులు, సభ్యులు తదితరులు

శిడ్లఘట్ట, జూన్ 14: శుద్ధతాగునీరు లభించని గ్రామీణ ప్రాంతాల ప్రజల ఆరోగ్య దృష్ట్యా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల గ్రాంట్లతో ఇంటింటికీ తాగునీరు అందించడమే జలజీవన్ మిషన్ లక్ష్యమని గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత సభ్యుడు ఆర్‌పి ఉమేశ్ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని మేలూరు గ్రామంలో గంగాదేవి ఆలయ సమీపాన రూ.1.75 కోట్లతో 850 ఇళ్లకు ఇంటింటికీ తాగునీటి అందించే పనులకు భూమిపూజ చేసి మాట్లాడారు. నీటి సమస్యను ఎవరూ ఎదుర్కొనరాదనే ఈ పథకం ఉద్దేశ్యమన్నారు. ప్రజలు స్వచ్ఛతను పాటించాలన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ అధ్యక్షుడు శశికళ రమేశ్, ఉపాధ్యక్షులు శివకుమార్, సభ్యులు ఎంకే రవిప్రసాద్, ఎంజే శ్రీనివాస్, భాగ్యమ్మ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వర్తూరు రోడ్డు విస్తరణ పనుల పరిశీలన



రోడ్డు పనుల విస్తరణను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మంజుళా లింబావళి

మహదేవపుర, జూన్ 14: నియోజకవర్గంలోని వర్తూరు గ్రామంలోని రోడ్ల విస్తరణ పనుల ప్రక్రియ చేపట్టారు. ఎంతోకాలంగా డిమాండ్ ఉన్న రోడ్డు పనులు విస్తరణ చేపట్టడంపై హర్షం వ్యక్తం అవుతోంది. హొసకోటె నుంచి సర్జాపురవైపు వెళ్లేందుకు ఈ మార్గం ప్రముఖమైనది. వర్తూరు గ్రామంనుంచి గుంజూరు వరకు ఉన్న రోడ్డు విస్తరణ కానుంది. రోడ్డు పనులను ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి స్వయంగా పరిశీలించారు. గడువులోగా రోడ్డు విస్తరణ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి అరవింద లింబావళి, ట్రాఫిక్ ఏసీపీ అనుచేత్, బీజేపీ నాయకులు మనోహరరెడ్డి, నటరాజ్, ప్రముఖులు ఎల్ రాజేశ్, మహేంద్రమోది, వెంకటేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలో వైసీపీ సెక్రటరీ..!

అనంతపురంరూరల్, జూన్ 14: ఆయన పంచాయతీ కార్యదర్శి. వైసీపీ కార్యదర్శిలా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఆయన గురించి తెలిసిన ఎవరిని అడిగినా ఇదే మాట చెబుతారు. ఇతర కార్యదర్శులు ఆయన పేరెత్తితే వామ్మో అంటూ బెంబేలెత్తుతారు. పంచాయతీలో సదరు కార్యదర్శి వ్యవహారాల గురించి ఉన్నతాధికారులు తెలిసినా మిన్నకుండిపోయినట్లు చెబుతున్నారు. ఆయనకు ఏం చెప్పాలన్నా.. మాట్లాడాలన్నా.. ఆలోచిస్తారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. పాలకపక్షం మారినా ఆయనలో మాత్రం మార్పు రాలేదంటున్నారు. ఇప్పటికీ వైసీపీ సేవలోనే తరిస్తున్నారు. వారంరోజుల కిందట ఓ మాజీ ప్రజాతినిధికి సైలెంటుగా రూ.15లక్షలు బిల్లులు ఇచ్చేశారట. దీనిని బట్టి చూస్తే ఆయన ఏ రీతిలో వైసీపీ ప్రజాప్రతినిధులకు పనిచేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ఆయన తీరుతో పంచాయతీ ఖజానా ఖాళీ అయింది. కార్మికులకు ఈనెల వేతనాలు చెల్లించేందు కూడా పైసల్లేని దుస్థితి ఏర్పడిందని ఆ వర్గాలు వాపోతున్నాయి. అనంతపురం రూరల్ మండలంలోని ఓ పంచాయతీ కార్యదర్శి నిర్వాకం ఇది.

ఇష్టారాజ్యంగా బిల్లులు

సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్‌కు రెండు, మూడు నెలల ముందు పంచాయతీలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అప్పటి ప్రజాప్రతినిధి తన కుటుంబ సభ్యులను బినామీలుగా పెట్టి దాదాపు రూ.3కోట్ల వర్కులు మొదలు పెట్టారు. ఈ క్రమంలో మట్టిరోడ్లు, సీసీ రోడ్ల పనులు కొంతమేర చేపట్టారు. ఈ పనులకు ఎక్కువశాతం పంచాయతీ వర్కర్లనే కూలీలుగా పెట్టేశాడు కార్యదర్శి. కాంక్రీటు పనులు మినహాయిస్తే.. ప్రతిదీ పంచాయతీ కార్మికులతోనే చేయించాడు. తద్వారా ఆ మాజీ ప్రజాప్రతినిధి, అతడి కుటుంబ సభ్యులకు బిల్లులు చేసేశాడు. అభివృద్ధి పనులు చేపట్టాలంటే పంచాయతీ తీర్మానాలు చేయాలి. పనులు చేసిన తరువాత బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. ఈ పంచాయతీలో మాత్రం ఇందుకు విరుద్ధంగా కార్యదర్శి వ్యవహారాలు నడిపారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పనులు జరగకనే.. కనీసం తీర్మానాలు కూడా చేయకుండానే బిల్లులు ఇచ్చేశారు. ఎవరైనా అడిగితే 'వచ్చేది మన (వైసీపీ) ప్రభుత్వమే.. ఏముందిలే.. అనడం' కొసమెరుపు. ఎన్నికల కౌంటింగ్ అనంతరం సదరు ప్రజాప్రతినిధికి రూ.15 లక్షల బిల్లులు ఇచ్చారంటే ఆయనకు..వైసీపీ అన్నా.. ఆ పార్టీ మాజీ ప్రజాప్రతినిధులన్నా.. ఎంత ప్రేమో అర్థం చేసుకోవచ్చు. ఇటీవల పంచాయతీ పరిధిలోని ఓ లేఔట్ విషయంలో మాజీ ప్రజాప్రతినిధి రూ.కోటి ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. లేఔట్ వేసినవారు ఇవ్వకపోవడంతో ఆ ప్రజాప్రతినిధి సూచన మేరకు పంచాయతీ కార్యదర్శి లేఔట్‌కు అనుమతులు లేవంటూ.. ఫ్లెక్సీ ఏర్పాటు చేసి.. ఆ ప్రజాప్రతినిధికి సొమ్ము ఇప్పించేందుకు తనవంతు ప్రయత్నాలు చేశారన్న వాదనలు ఆయావర్గాల నుంచే వినిపిస్తున్నాయి.

ఖజానా ఖాళీ

సదరు కార్యదర్శి.. వైసీపీపై ఉన్న అభిమానంతో పంచాయతీ ఖజానా ఖాళీ చేశాడని ఆయావర్గాల ద్వారా తెలుస్తోంది. కోట్ల రూపాయాలు పంచాయతీ ఖజానాలో ఉండగా.. ఆసొమ్మును మాజీ ప్రజాప్రతినిధి, ఆయన కుటుంబ సభ్యులకు అభివృద్ధి పనుల బిల్లుల పేరిట చెల్లించేశాడని తెలుస్తోంది. అలా ఖజానా ఖాళీ చేశారట. తనకు అనుకూలమైన ఓ ఉద్యోగికి రూ.2 లక్షలు పంచాయతీ సొమ్ము డ్రా చేసి ఇచ్చారని ఆయావర్గాల్లో చర్చ సాగుతోంది. ఇలా ఇష్టారాజ్యం చెల్లింపులతో పంచాయతీ ఖజానా ఖాళీ అయిందని తెలుస్తోంది.

ఇన్‌చార్జ్ ఈఓగా నారాయణ



శిడ్లఘట్ట, జూన్ 14: తాలూకా పంచాయతీ కార్యనిర్వహణాధికారిగా ఎస్ నారాయణ్‌కు అదనపు బాధ్య తలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మీడి యాతో మాట్లాడుతూ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆదే శాల మేరకు ఇన్‌చార్జ్ బాధ్యతలు చేపట్టినట్టు తెలిపారు. ప్రభుత్వ పథకాలు గ్రామ పంచాయతీ ద్వారా ప్రజలకు అందించేలా కృషి చేస్తానన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో మౌలిక సదుపాయాలు కల్పించేం దుకు ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు.

నేడు సర్వసభ్య వార్షిక మహాసభ

శిడ్లఘట్ట, జూన్ 14: పట్టణంలోని యతీంద్రగనర్‌లో కొలువైన పురాతనకాలం నాటి వీరాంజనేయస్వామి ఆలయానికి అనుబంధమైన బలిజ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం సర్వసభ్య వార్షిక మహాసభ జరగనుంది. సాయంత్రం 6.30 గంటలకు ఏర్పాటయ్యే సమావేశానికి సభ్యులంతా పాల్గొని అభివృద్ధికి సహకరించాలని అధ్యక్షులు, కార్యవర్గ సమితి ప్రకటనలో కోరారు.

ఆరోగ్యానికి చక్కటి నిద్ర అవసరం

బెంగళూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యానికి చక్కటి నిద్ర అవసరమని మ్యాగ్నిఫ్లెక్స్ ఇండియా ఎండీ ఆనంద్ నిచాని అభిప్రాయపడ్డారు. కంపెనీచే విలాసవంతమైన మ్యాట్రెస్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు అనుకూలంగా ఉండేలాంటి ఉత్పత్తులను విడుదల చేశామన్నారు. వాతావరణంలో ఎటువంటి మార్పులు వచ్చినా ఆధునిక మ్యాట్రెస్ అనుకూలం ఉండేలా తయారు చేశామన్నారు.

ఎన్ఎస్ఎస్ శిబిరం ప్రారంభం

దొమ్మసంద్ర, జూన్ 14: ఆనేకల్ తాలూకా ఇండ్లవాడి గ్రామంలోని డాక్టర్ ఎస్ గోపాలరాజు ప్రభుత్వ ఫస్ట్‌గ్రేడ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ వార్షిక విశేష శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ అధ్యక్షత వహించగా గ్రామపంచాయతీ అధ్యక్షు రాలు రత్నమ్మ అశ్వత్థప్ప ప్రారంభించారు. పీడీఓ సౌజన్య అశోకరెడ్డి, గ్రామపంచాయతీ సభ్యులు, కళాశాల అధ్యాపక, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఇండ్లవాడి గ్రామపంచాయతీ సహకారంతో ఎన్ఎస్ఎస్ శిబిరం విజయవంతమైందని సంచాలకులు డాక్టర్ రామకృష్ణప్ప వెల్లడించారు.

అరకొరగా పాఠ్యపుస్తకాల సరఫరా

కొత్తచెరువు, జూన్ 14: జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అరకొరగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం సరఫరా అయినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో నూతనంగా కొలువుదీరిన కూటమి ప్రభుత్వంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆశలు పెట్టుకున్నారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 7వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం నుంచి ఉచిత పాఠ్యపుస్తకాలు కొత్తచెరువులోని జిల్లా పుస్తకాల గోదాముకు సరఫరా అవుతున్నాయి. వాటిని విద్యాశాఖాధికారులు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేస్తున్నారు. ఎంఈఓలు... ఆయా పాఠశాలల హెచ్ఎంలకు అందజేస్తున్నారు. ఇప్పటివరకు జిల్లాలోని 1 నుంచి 7 తరగతుల వారికి మూడు విడతల్లో అన్ని సబ్జెక్టుల పాఠ్యపుస్తకాలు సరఫరా అయ్యాయనీ, వాటిని విద్యార్థులకు 13వ తేదీ నుంచే అందజేస్తున్నామని డీఈఓ మీనాక్షి తెలిపారు. 8, 9, 10 తరగతులకు సంబంధించి 14 మండలాలకు పాఠ్యపుస్తకాలు విజయవాడ నుంచే నేరుగా జిల్లా పరిషత్ పాఠశాలలకు సరఫరా అవుతున్నాయన్నారు. 18 మండలాలకు పాఠ్యపుస్తకాలు సరఫరా కావాల్సి ఉందన్నారు. యూనిఫాం ప్రస్తుతం రెండు మండలాలకు మాత్రమే సరఫరా అయింది. షూస్ 5 మండలాలకు వచ్చాయి. మిగిలిన 27 మండలాలకు సరఫరా కావాల్సి ఉంది. ఈనెల 18వ తేదీలోగా పూర్తిస్థాయిలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డీఈఓ తెలిపారు. నోటు పుస్తకాలు, బెల్టులు, నిఘంటువులు పూర్తిస్థాయిలో సరఫరా అయ్యాయనీ, వాటిని విద్యార్థులకు అందజేస్తున్నామన్నారు. మిగిలినవి పంపిణీ చేస్తామని డీఈఓ వివరించారు. వైసీపీ పాలనలో పాఠ్యపుస్తకాలు అందక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారనీ, కొత్త ప్రభుత్వంలోనైనా పూర్తిస్థాయిలో అందేనా అని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

29న జాతీయ లోక్ అదాలత్

పెనుకొండ టౌన్, జూన్ 14 : పట్టణంలో ఈనెల 29న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి వాసుదేవన్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర సేవాధికార సంస్థ అమరావతి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అనంతపురం ఉత్తర్వుల మేరకు జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ నిర్వహిస్తామని, కక్షిదారులు ఈ అవ కాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సివిల్, క్రిమినల్, ప్రీ లిటిగేషన్ తదితర కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలని కక్షిదారులకు సూచించారు.